# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1 ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజులు పర్యటన నిమిత్తం సింగపూర్ బయలు దేరి వెళ్లారు.**

**2) కాకినాడ జిల్లా, తుని మండలంలో తప్పి పోయిన బాలిక ఆచూకీ కోసం మరిన్ని బృందాలను రంగంలోకి దింపాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు.**

**3) శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ చెప్పారు.**

**4) యోగాభ్యసనం ద్వారా ఆరోగ్యంతో పాటు.. మానసిక ప్రశాంతత కలుగుతుందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.**

==========================

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల సింగపూర్ పర్యటనకు ఈరోజు బెంగుళూరు నుంచి బయలు దేరి వెళ్ళారు. ఆయన ఈ సాయంత్రం సింగపూర్ చేరుకోనున్నారు. ఈ పర్యటనలో సింగపూర్ ప్రధాని, పలువురు మంత్రులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. అలాగే అంకుర సంస్థలు, సెమీకండక్టర్ రంగం, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల అంశాలపై జరిగే పలు కీలక సమావేశాల్లో పాల్గొంటారు. సీఐఐ పార్ట్‌నర్ షిప్ సమ్మిట్ పెట్టుబడుల సన్నాహక రోడ్‌షోలో పాల్గొంటారు. అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణతో పాటు పలువురు ఉన్నతాధికారులు సింగపూర్ లో పర్యటిస్తారు.

-------------------------

కాకినాడ జిల్లా, తుని మండల పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి బాలిక జ్ఞానేశ్వరి ఆచూకీ త్వరితగతిన కనుగొనేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం గాలింపు చర్యల్లో పాల్గొంటున్న పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు కూడా వినిగియోగించుకోవాలని అయన తెలిపారు. బాలిక అదృశ్యం ఘటనపై ఆయన నిన్న మరోసారి కాకినాడ జిల్లా ఎస్పీతో గుంటూరు జిల్లా మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి ఫోన్ లో సమీక్షించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తున్నారని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయమంత్రి శోభా కరంద్లాజే పేర్కొన్నారు. తిరుమల శ్రీవారిని ఈరోజు ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల విలేకరులతో ఆమె మాట్లాడుతూ... ఇప్పటి వరకు ఎన్నికైన ప్రధానమంత్రుల్లో అత్యధిక కాలం దేశానికి సేవలందించిన ప్రధాని నరేంద్ర మోదీనే అన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులుతో మాట్లాడుతూ...

.. వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి స్వనిధి పథకానికి ఈనెల 20 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. అధిక వడ్డీతో వీధి వ్యాపారులు రుణాలు తీసుకొని ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా సులభంగా రుణాలను అందిస్తోందని ఆయన చెప్పారు. సకాలంలో రుణ వాయిదాలు చెల్లించిన వారికి రెండు.. మూడు విడతలలో కూడా రుణాలను మంజూరు చేస్తున్నామని ఆయన అన్నారు.

---------------------------

వైద్య ఆరోగ్య రంగంలో మార్పులు తీసుకురావడంతో పాటు శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖమంత్రి వై.సత్యకుమార్ యాదవ్ చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కే. ఎల్. విశ్వవిద్యా లయంలో నిన్న జరిగిన 17వ జాతీయ నవజాత శిశువుల సంరక్షణ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత రెండేళ్లలో శిశు మరణాల రేటును 46.8 శాతం నుంచి 36 శాతంకు తగ్గించామని తెలిపారు. రాష్ట్రంలో గతంలో 62 ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు ఉండేవని, ఎన్డీయే ప్రభుత్వంలో మరో 8 ఏర్పాటు చేశామని వివరించారు.

---------------------------

యోగాభ్యసనం ద్వారా ఆరోగ్యంతో పాటు.. మానసిక ప్రశాంతత కలుగుతుందని సూక్ష్మ, చిన్న , మధ్య తరహా పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా వేడుకల్లో భాగంగా విజయనగరం జిల్లా బొండపల్లి మండలం నెలివాడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారతదేశంలో మన పూర్వీకులు మానవాళికి అందించిన అత్యంత గొప్ప వరం యోగా అని కొనియాడారు. కరోనా కష్టకాలంలో తాను సైతం యోగా, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం చేయడం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకున్నానని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు.

---------------------------

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగంగానే యోగాంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. పెనుగొండలో నిర్వహించిన "టెంపుల్ యోగా" కార్యక్రమంలో ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, ఇతర అధికారులతో కలిసి ఆమె యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

-------------------------

అనంతపురంలో ఈరోజు నుండి 16వ తేదీ వరకు సోలో యోగ ప్రదర్శన, ప్రాణాయామ గ్రూప్ యోగ ప్రదర్శన విభాగాలలో పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణ రెడ్డి తెలిపారు. ఈ రోజు అనంతపురం లోని ఇన్ డోర్ స్టేడియంలో యోగాంధ్ర జిల్లా స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు.

-------------------------

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. కడివెళ్ల సమీపంలోని కప్పల వాగులోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన భారీ వరద నీటి కారణంగా పత్తికొండ-ఎమ్మిగనూరు మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో రహదారి ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

-------------------------

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విజయవాడ ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో బ్యారేజ్‌లోకి వస్తున్న మిగులు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజ్ గేట్లను ఎత్తి సుమారు రెండు వేల నుంచి మూడు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు కృష్ణా సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి కిరణ్ చెప్పారు. వర్షపాతం పరిస్థితులు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ప్రవాహాలను బట్టి నీటి విడుదల పరిమాణంలో మార్పులు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కృష్ణానది ఎగువ, దిగువ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

-------------------------

ఈ ఏడాది ఖరీఫ్ సాగు సఫలం కావాలని అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. రైతులకు వరి విత్తనాలు, యూరియా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన ఈ రోజు చల్లపల్లిలో రైతు సేవా కేంద్రం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది 77 కోట్ల రూపాయల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో రైతుల ఖాతాకు సొమ్ము జమ చేసిందని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతులు యాప్ ద్వారా యూరియా తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

-------------------------

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, తమిళనాడులపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని అమరావతి వాతావరణం కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం బలహీనపడిందని వాతావరణ కేంద్ర అధికారి నారాయణ వెల్లడించారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేక ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్…25 సెకన్లు

=====================